క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో నాయకులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు ఆదివారం నాటికి 42 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు యువజన, కుల సంఘాల, వ్యాపార వర్గాల వారు, పలు పార్టీల నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ మంజూరు చేసేవరకు విశ్రమించమని, ఆందోళన ఉధృతం చేస్తామని అఖిలపక్ష నేతలు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో మల్లికార్జున స్వామి జాతర



జాతరలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ఆదివారం స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర నిర్వాహకులు నీలం మధును సన్మానించారు. కార్యక్రమంలో చెన్నకృష్ణ గౌడ్, రమేశ్‌గుప్తా, ఏర్రం సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, సాయిలు గౌడ్, సత్యనారాయణ గౌడ్ విఠల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా కొనుగోలు చేయడం లేదు

చేగుంట(తూప్రాన్): అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం ధాన్యం త్వరగా తీసుకోవడం లేదని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడియారం గ్రామంలో ఆత్మగౌరవ యాత్ర నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళా రైతులతో మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. రైతుల ధాన్యం త్వరగా తీసుకోకుంటే రైతుల పక్షాన నిలబడి పోరాడుతామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను అములు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్, వడ్ల నవీన్, స్టాలిన్, వెంకటేశం, అన్నం అంజనేయులుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కూచారంలో స్వచ్ఛభారత్



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు ఆదివారం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువజన భవనం వద్ద, గ్రామ మహిళా సమైఖ్య భవనం పరిసరాల వద్ద 264వ వారంలో భాగంగా పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. చెత్త, చెదారాన్ని సేకరించి డంప్ యార్డ్‌కు తరలించారు. అలాగే వీధులను యువత శుభ్రం చేశారు.

పరామర్శ



శివనీలతో మాట్లాడుతున్న దామోదర

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి వీరభద్రాలయ అర్చకుడు జంగం చిన్నవీరన్న స్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీరన్నస్వామి భార్య శివనీల, కూతురు శివానీల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దామోదర రాజనర్సింహ కూతురు త్రిష, గ్రామ నాయకులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

నర్సాపూర్: గిరిజన గురుకులంలో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్య చెప్పారు. ప్రభుత్వం తమ పాఠశాలలో చేరేందుకు ఆదివారం పరీక్ష నిర్వహించగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి 349 మంది విద్యార్థులకు 131మంది హాజరైనారని ఆయన తెలిపారు. గురుకుల అధికారి కోటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రవేశ పరీక్ష చేపట్టామని వివరించారు.

కాంటా.. తంటా



ధాన్యాన్ని తూర్పార పడుతున్న రైతులు

- ధాన్యం తూర్పార పడితే లారీకి రెండున్నర క్వింటాళ్లు.. లేదంటే బస్తాకు 10 కిలోలు
- తరుగు పేరుతో రైతులకు తిప్పలు
- కొల్చారం మండలంలో రైస్ మిల్లర్ల డిమాండ్

కొల్చారం(నర్సాపూర్): రైతు ఆరుగాలం కష్టపడితే కానీ పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. చేతికొచ్చిన పంట అమ్ముకునే దశలో అకాల వర్షం రూపంలో రైతుకు మరో దెబ్బ. కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర వస్తుందనుకుంటున్నా.. రైస్ మిల్లుల యజమాన్యాలు పెడుతున్న షరతులతో రైతులు భయాందోళలకు గురవుతున్నారు. ప్రస్తుతం కొల్చారం మండలంలోని రైతులు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు.

రైస్ మిల్లుల దోపిడీ..

మండలంలో ఈసారి రెండు రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం కొనుగోలుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. వీటిలో మండల కేంద్రం కొల్చారంలోని సత్యసాయి పారా బాయిల్డ్ రైస్ మిల్, మరొకటి ఎనగండ్ల శివారు దుంపలకుంట చౌరస్తాలోని బాలాజీ పారా బాయిల్డ్ రైస్ మిల్.

- మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో బస్తా తూకం 42 కిలోల 50 గ్రాములు తూకం వేస్తున్నారు.
- తూర్పార బట్టి, మెరుగైన ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలన్న లారీకి రెండున్నర క్వింటాల నుంచి మూడు క్వింటాళ్ల తరుగు పేరిట దోపిడీ.
- ధాన్యం ఏ మాత్రం రంగు మారినా, ధాన్యంలో తాలు శాతం ఎక్కువగా ఉన్న బస్తాకు 10 కిలోలు తరుగు ఇస్తేనే అన్‌లోడ్ చేస్తామంటూ డిమాండ్ చేస్తున్నారు.
- 42 1/2 కిలోలు కాదు, 43 కిలోలు తూకం ఉండాల్సిందేనని బాహాటంగానే చెబుతున్నారు. అది కాదంటే లారీలను వెనక్కు తీసుకెళ్లడంటూ రైతులకు చుక్కలు చూపెడుతున్నారు.
- ధాన్యం కొనుగోలు ఇప్పుడిప్పుడే మొదలైన తరుణంలో ఈ రకంగా తమను దోపిడీ చేయడం ఎంతవరకు సమంజసం అని రైతులు వా పోతున్నారు. ఇదే విషయమై సంబంధిత ధా న్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందిని ఆరాతీస్తే.. మేము ఎందుకు నష్టపోవాలంటూ రైస్ మిల్లర్లు సమాధానమిస్తున్నారంటూ పేరు చెప్పని ఓ సంఘం సీఈఓ 'సాక్షి'తో తెలిపారు.
- రైతుకు మేలు చేకూర్చాలన్న, రైస్ మిల్లర్లను అధికారులు కట్టడి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చంద్రశేఖర్ రావును వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైస్ మిల్లర్లతో చర్చిస్తున్నామని వివరించారు.

బస్తాకు 10 కిలోల తరుగు



కొల్చారంలోని సత్యసాయి రైస్ మిల్లుకు లారీ ధాన్యాన్ని అన్‌లోడ్ కోసం తీసుకెళ్లాం. ధాన్యాన్ని చూసిన మిల్లు యజమాని రంగు మారింది. తాలు ఎక్కువగా ఉంది. బస్తాకు పది కిలోల తరుగు ఇస్తేనే ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తానని చెబుతున్నాడు. లేదంటే లారీని వెనక్కు తీసుకెళ్లాలని చెబుతున్నాడు. రెండు రోజులుగా అక్కడే ఉన్నా. కొనుగోలు కేంద్రం సిబ్బంది కూడా ఈ విషయాన్నే చెబుతున్నారు.

– అమరేందర్, రైతు, రంగంపేట

గ్యాస్ డెలివరీ బాయ్‌పై దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

నర్సాపూర్: గ్యాస్ డెలివరీ బాయ్‌పై దాడి చేయడంతో ఆదివారం నర్సాపూర్‌లో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. కొట్టిన వ్యక్తిని అరెస్ట్ చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్‌లోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో గుర్రాల లింగం గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పట్టణంలోని మెదక్ రోడ్డులో మహ్మద్ ఇమ్రాన్ ఇంటికి సిలిండర్ డెలివరీ చేసేందుకు వెళ్లాడు. గ్యాస్ సిలిండర్ ఇచ్చిన తర్వాత ఖాళీ సిలిండర్ ఇవ్వమనగా రెండు రోజుల తర్వాత ఇస్తామని చెప్పడంతో అలా కుదరదని, వెంటనే ఇవ్వాలన్నాడు. దీంతో మహ్మద్ ఇమ్రాన్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. లింగం హనుమాన్ మాలలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న దీంతో కొంత మంది మాలధారులు అక్కడకు వచ్చి ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. వారికి మద్దతుగా బీజేపీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, ఆయా పార్టీల నాయకులు మల్లేష్‌గౌడ్, రాజేందర్, బుచ్చేష్‌యాదవ్, ఓంకార్, అశోక్‌గౌడ్, రాజు, బాల్‌రాజ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు ధర్నాలో కూర్చున్నారు. మురళీయాదవ్ తదితరులు దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలన్నారు.

నిందితుడిని పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తీసుకురాగానే మాలధారులు ఒక్కసారిగా వాహనాన్ని చుట్టుముట్టారు. అతి కష్టంమీద అతడిని స్టేషన్‌లోకి తీసుకెళ్లారు. గ్యాస్ డెలివరీ బాయ్ గుర్రాల లింగం ఫిర్యాదు మేరకు నర్సాపూర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న నటుడు వాసుదేవరావు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో నూతన ఎల్లమ్మ ఆలయంలో పొగాకు నర్సింలు, సత్యనారాయణ అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దేవాలయానికి బలగం సినిమా సహాయ నటుడు వాసుదేవరావు, పలువురు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణుకుమార్, వార్డు సభ్యులు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, నాయకులు స్వామి, మహేశ్, ఆనంద్, నర్సింలు, సాయిలు, కీసర వెంకటేశ్ తదితరులున్నారు.

'బీజేపీ నాటకాలు తెలంగాణలో సాగవు'

దుబ్బాకటౌన్: బీజేపీ కపట నాటకాలు తెలంగాణలో సాగవని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన తెలంగాణలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత భూంరెడ్డి, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు పేటలో ఘనంగా జరిగాయి. ఆదివారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళిపంతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేను భారీ గజమాలతో సన్మానించి, కత్తిని బహూకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దత్తు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుంట్ల రాములు, రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్ఎన్.సంతోశ్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, కో ఆప్షన్ యాదుల్‌హుస్సేన్, నాయకులు మానిక్‌రెడ్డి, కందుకూరి రవీందర్, వెంకట్‌రెడ్డి, వంశీ, పున్నయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక: రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవానికి ఆదివారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని రామ్‌సాగర్ గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ బాధ్యులు ఆయనకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

నేత్రపర్వంగా వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



గరుడ వాహన సేవలో భక్తులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో కొలువుదీరిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి మూల విరాట్టులకు అర్చక స్వాములు అభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది.

నిరుద్యోగుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు గురువారెడ్డి

గజ్వేల్: నిరుద్యోగుల సమస్యలపై పోరాటాలను ముమ్మరం చేస్తామని బీజేపీ సీనియర్ నాయకులు గురువారెడ్డి తెలిపారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో 30లక్షల మంది నిరుద్యోగులు ఇబ్బందిపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు అండగా బీజేపీ నుంచి రాజీలేని పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 9న గజ్వేల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నందన్‌గౌడ్, రామ్‌మోహన్, సాయికుమార్, యెల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, కుడిక్యాల రాములు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగ యువతను మోసం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్బం గడుపుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం గజ్వేల్‌లో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో నిరుద్యోగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నోటిఫికేషన్లు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. 9ఏళ్లు గడిచినా వారు చేసిందేమి లేదన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేశంగౌడ్, నక్క రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై కేసులను ఎత్తివేయాలి



మాట్లాడుతున్న శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): అంబేడ్కర్ విగ్రహాన్ని మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన 28 మంది దళితులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన చలో ధర్మారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాయమైన విగ్రహాన్ని ఏర్పాటు చేసేవరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు సూకూరి ప్రవీణ్, అస్క స్వామి, కిరణ్, భిక్షపతి, చెప్యాల యాదగిరి, పరశురాములు, కనకయ్య, మల్లేశం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులకు మంచినీరు, వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

కనుల పండువగా వీరభద్రుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రకాళీ సమేత వీరభద్రుడికి ఉదయం అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఏడుపాయల ఆలయ కమిటీ చైర్మన్ బాలాగౌడ్ తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను, ఎదుర్కొళ్లను జరిపి స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఉత్సవాల్లో మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఆయన కూతురు త్రిష పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంచింతకుంట గ్రామానికి చెందిన నర్సింలు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యోణోత్సవంలో పాల్గొనడంతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు వీరన్నస్వామి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం వేళలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

నేడు బోనాల ఊరేగింపు..

ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ దేవతలు దుర్గమ్మ, పోచమ్మలకు బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

నేడు రథోత్సవం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఏటా 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా నిత్యపూజ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆలయ అర్చకుడు గోపాలశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకి సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేణుగోపాలస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టంలో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించనున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పాపన్నపేటలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

పాపన్నపేట(మెదక్): పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం పాపన్నపేటలోని అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. అకాల వర్షాలకు పంటనష్టం వాటిల్లిన బాధిత రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పరిశీలనలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపీటీసీలు శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, అనీల్, యాదగిరి, విఠలాక్షప్ప, ప్రేమ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మెదక్ రూరల్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణను కోల్పోవడం దురదృష్టకారమని మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం హావేలిఘనపూర్ మండలం ఫరిద్‌పూర్ గ్రామానికి చెందిన పండ్ల కృష్ణ ప్రమాదవశాత్తు మరణించిన సంగతి తెలుసుకొని భౌతిక దేహానికి నివాళులర్పించారు. తక్షణ సాయం కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో పీసీసీ నాయకులు ఆంజనేయులు, కృష్ణ, సుదర్శన్, గూడూరి ఆంజనేయులు, రమేశ్‌గౌడ్, అదిల్, ప్రభాకర్ ఇతరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు



మట్టి తవ్వకాలు చేసిన అసైన్డ్ భూమి ఇదే

- వెంచర్‌కు తరలిస్తున్న మట్టి
- పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది



వెంచర్ ఏర్పాటుకు పోసిన మట్టి

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో నుంచి అక్రమంగా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామ పరిధిలోని అసైండ్ భూమి సర్వే నంబర్ 309లో నుంచి జేసీబీలతో తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. మండల సరిహద్దు కావడంతో ఇక్కడ నిత్యం మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో నుంచి రాత్రి వేళ దర్జాగా మట్టిని తరలిస్తున్నారు. ఇదే గ్రామంలోని అసైన్డ్ భూమిలో వెంచర్ ఏర్పాటు కోసం మట్టిని పోసి చదును చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాల్టా చట్టానికి విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

సాగు కోసం ఇచ్చిన అసైన్డ్ భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు నిషేధం. నవాబుపేటలో మట్టి తవ్వకాలపై విచారణ చేపట్టి బాధ్యులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. విధులపై నిర్లక్ష్యదోరణి అవలంభించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

– సాయిరాం, ఆర్డీఓ